
దరఖాస్తు సెంటర్‌ను పరిశీలిస్తున్న మార్కెట్ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్

రాజీవ్ యువవికాసాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● **హైదరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్**

సైదాబాద్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగ యువత ఉపాధి కోసం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ అన్నారు. సోమవారం సైదాబాద్‌కాలనీలో జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయంలో దరఖాస్తు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ పథకం ద్వారా నిరుద్యోగులకు గరిష్ఠంగా రూ.4లక్షల వరకు రుణాలను ప్రభుత్వం అందించనుందని వివరించారు. రూ.50వేల యూనిట్‌కు 100శాతం సబ్సిడీ, లక్ష రూపాయల యూనిట్‌కు 90శాతం, రూ.2లక్షల యూనిట్‌కు 80శాతం, రూ.4లక్షల యూనిట్‌కు 70శాతం సబ్సిడీ వర్తిస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల సహకారంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 14లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

11న అరుణాచలంకు ప్రత్యేక బస్సులు

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): చైత్ర పౌర్ణమి పురస్కరించుకుని తమిళనాడులోని అరుణాచలంలో గిరి ప్రదక్షిణ చేసే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ హైదరాబాద్-2 డిపో నుంచి ఈనెల 11న అరుణాచలంకు ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్లు డిపో మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. 11వ తేదీన రాత్రి 7గంటలకు దిల్‌సుఖ్‌నగర్ బస్‌స్టేషన్ నుంచి బయల్దేరనున్న ఈ ప్రత్యేక బస్సులు కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలంకు 12వ తేదీన చేరుకుంటుందని ఆయన తెలిపారు. 13వ తేదీన మధ్యాహ్నం అరుణాచలం నుంచి తిరిగి బయల్దేరి మరుసటి రోజైన 14వ తేదీన సాయంత్రం 6గంటలకు హైదరాబాద్ చేరుకుంటుందని డీఎం వివరించారు. ఒక్కరికి టికెట్ చార్జీ రూ.3800లు వసూలు చేయనున్నారు. అరుణాచలంకు వెళ్లదలచిన భక్తులు ఆన్‌లైన్ ద్వారా గాని, రిజర్వేషన్ కౌంటర్ల ద్వారాగాని, ఏటీబీ ఏజెంట్ల ద్వారా గాని టికెట్లను పొందవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9959444165, 9666350995, 7382838010, 9959226249 ద్వారా సంప్రదించవచ్చన్నారు.

రోజు విడిచి రోజు కృష్ణానీరు సరఫరా చేయండి


జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నర్సింహ, ప్రవీణ్

సరూర్‌నగర్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని 6వ, 26వ డివిజన్లకు ప్రస్తుతం నాలుగైదు రోజులకోసారి కృష్ణానీరు సరఫరా అవుతున్నదని, ప్రస్తుతం ఎండాకాలం దృష్ట్యా స్థానికులకు సదరు నీరు సరిపోవడం లేద ని 26వ డివిజన్ మాజీ కార్పొరేటర్ పెండ్యాల నర్సింహ పేర్కొన్నారు. ఈ దృష్ట్యా ఆయా డివిజన్లకు రోజువిడిచి రోజు నీటి సరఫరా జరిగేలా చూడాల్సిందిగా ఆయన జలమండలి అధికారులను కోరారు. సోమవారం 6వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మమత భర్త ప్రవీణ్‌తో కలిసి సాహెబ్‌నగర్ రిజర్వాయర్‌లోని జలమండలి కార్యాలయంలో జీఎం శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ స్థానికుల అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని రోజు విడిచి రోజు నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా తమ సిబ్బందితో సర్వేచేయించి తగినచర్యలు తీసుకుంటామని జీఎం తెలిపారు.


యోగా తరగతుల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్ తదితరులు

రేపటి నుంచి యోగా శిక్షణ తరగతులు

వనస్థలిపురం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): షిరిడీ సాయి అష్టాంగ యోగా శిక్షణ తరగతులను వనస్థలిపురం ప్రశాంత్‌నగర్‌లోని కనకదుర్గాదేవి ఆలయ ప్రాంగణంలో 9వ తేదీ బుధవారం నుంచి ప్రారంభమవుతున్నట్లు జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా యోగా శిక్షణ తరగతులకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం వనస్థలిపురం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భావన శ్రీనివాస్ మాట్లాడుతూ యోగా నిపుణులు ఇస్మాయిల్ గురూజీ పర్యవేక్షణలో జరిగే ఈ తరగతులు నిత్యం ఉదయం 5.30గంటల నుంచి 7గంటలకు, సాయంత్రం 6గంటల నుంచి 7.30 గంటలకు రెండు బ్యాచ్‌లుగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ తరగతులను 14 నుంచి 70ఏళ్ల మధ్య వయస్కులు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 9603256572 నంబర్‌లో సంప్రదించగలరన్నారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో యోగా గురువు నరేందర్, పి.శ్రీనివాస్, అల్లాడి పరమేష్, గంగం శివశంకర్, డాక్టర్ శూలపాణి, ప్రభాకర్, రామచంద్రరావు, శ్రీరంగనాథ్, యాదా రామలింగేశ్వరరావు, శ్రీనివాసులు, అజయ్, వి.దూరయ్య, నందకిశోర్, మల్లికార్జున్, రవీందర్, సాయి, మోహన్, నర్సింహులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ పూర్తిచేసిన చందర్‌కు అభినందనలు


ఓయూలో పీహెచ్‌డీ పూర్తిచేసి వివరాలను ప్రొఫెసర్ ఉపేంద్రకుమార్‌కు అందజేస్తున్న డాక్టర్ నేనావత్ చందర్

చంపాపేట : హస్తినాపురం డివిజన్‌లోని షిరిడీ సాయినగర్‌కాలనీలో నివాసం ఉంటున్న డాక్టర్ నేనావత్ చందర్ హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో పారిశ్రామిక వాతావరణంలో మెరుగైన క్రమరాహిత్య గుర్తింపుపై పరిశోధనలో ఉత్సాహంగా పనిచేసి ఇటీవల పీహెచ్‌డీ డిగ్రీని పూర్తిచేసి వివరాలను అందజేశారు. ఓయూలో ప్రొఫెసర్ ఎం.ఉపేంద్రకుమార్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తిచేసిన చందర్‌కు పలువురు అభినందనలు తెలిపారు. ప్రస్తుతం చందర్ హైదరాబాద్‌లోని మల్లారెడ్డి యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. చందర్ స్వస్థలం నల్గొండ జిల్లా దేవరకొండ మండలంలోని ముదిగొండ గ్రామం. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఆయన చిన్ననాటి నుంచి చదువుల్లో రాణిస్తూ ముందుకు సాగారు.


ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా సోమవారం ప్రమాణ స్వీకారం చేసిన మల్క కొమురయ్యను కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి వీరేందర్‌బాబుయాదవ్ తదితరులు - సైదాబాద్, ఆంధ్రజ్యోతి

బాలాపూర్‌లో బెల్టుషాపులకు అడ్డుకట్ట పడేనా?

- **ఎత్తేయాలని అఖిలపక్ష భేటీలో గ్రామస్థుల తీర్మానం**
- **సంబంధిత అధికారులకు లేఖ అందజేయాలని నిర్ణయం**
- **తూతూ మంత్రంగానే ఎక్సైజ్ అధికారుల తనిఖీలు**
- **నెలవారీ మామూళ్ల కోసం అధికారుల సహకారం..!**

సరూర్‌నగర్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్‌శాఖ అధికారులు బెల్టుషాపుల నియంత్రణను పట్టించుకోకపోవడంతో బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ గ్రామస్థులు రంగంలోకి దిగారు. స్థానిక అఖిలపక్ష నేతలు, గ్రామపెద్దలు, పలు సంఘాల ప్రతినిధులు కలిసి ఇటీవల గ్రామంలోని ఓ దేవాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మద్యంబారిన పడి అనేక మంది యువకులు ప్రాణాలు కోల్పోతున్న నేపథ్యంలో బాలాపూర్‌లోని బెల్టు షాపులనన్నింటినీ మూసేయాల్సిందేనని తీర్మానం చేశారు. గ్రామంలోని ఏ వీధిలో చూసినా 24గంటల పాటు మద్యం అక్రమ విక్రయాలు జరుగుతుండడంతో పేద, మధ్య తరగతి ప్రజలు రెగ్యులర్‌గా అక్కడకు వెళ్లి చీప్ లిక్కర్ తీసుకుని తాగుతున్నారు. అతిగా సేవిస్తుండడంతో అనారోగ్యం బారిన పడి ఆస్పత్రుల్లో చేరి, అప్పుల పాలై చివరకు ప్రాణాలు విడుస్తున్నారు. గత ఆరు నెలల వ్యవధిలో ఇక్కడ ఐదారుగురు యువకులు ఇలా బలయినట్టు స్థానికులు చెబుతున్నారు. దాంతో ఇటీవల మాజీ డిప్యూటీ మేయర్, బీఎస్పీ రాష్ట్ర నాయకుడు ఇబ్రాం శేఖర్ బెల్టు షాపులు ఎత్తేయాలని, లేని పక్షంలో ఆందోళనలు నిర్వహిస్తామని ప్రకటించారు. అయినప్పటికీ ఎక్సైజ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరించారు. దాంతో దీనిని సీరియస్‌గా తీసుకున్న ఆయన గ్రామంలోని అన్ని పార్టీల నేతలు, గ్రామ పెద్దలతో చర్చించాలని నిర్ణయించారు. ఈ మేరకు స్థానిక నాయకులు పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నవారు శ్రీనివాస్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో ఇటీవల గ్రామంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు.


జనవరిలో బెల్టుషాపుల్లో తనిఖీలు జరిపిన ఎక్సైజ్ అధికారులు(ఫైల్)

ఒక్క 'బెల్టు' ఉండొద్దు..

బాలాపూర్‌లో ఒక్క బెల్టు షాపు కూడా ఉండొద్దని, బాలాపూర్ చౌరస్తాల్లోని వైన్స్‌లో తప్ప స్థానికంగా ఎక్కడా మద్యం అమ్మకాలు జరుగకుండా చూడాలని అఖిలపక్ష సమావేశంలో తీర్మానించారు. అదేవిధంగా ఎక్సైజ్ అధికారులు గ్రామంలో పర్యటించి బెల్టుషాపులను మూసేయించేలా చూడాలని, ఈ మేరకు వారికి వినతిపత్రాలు అందజేయాలని సమావేశంలో నిర్ణయించారు. షాపుల నిర్వాహకులు స్వచ్ఛందంగా బెల్టు షాపులను మూసేసి సహకరించాలని వారు సూచించారు. వైన్స్ యజమానులు సైతం బెల్టుషాపులకు మద్యం సరఫరా చేయొద్దని వారు సూచించారు. ఎక్సైజ్ అధికారులు ఒక్క బాలాపూర్‌లోనే కాకుండా బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అన్ని గ్రామాల్లోనూ బెల్టుషాపులు లేకుండా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు.


గ్రామాల్లోని బెల్టుషాపుల్లో క్వార్టర్ బాటిల్స్‌ను గ్లాసుల్లో పెట్టి అమ్మడానికి సిద్ధంగా ఉంచిన దృశ్యం

పరామర్శలో 'నో లిక్కర్'.. ఆదర్శంగా సీఎస్ఆర్..


ఇటీవల బాలాపూర్‌లో సమావేశమైన అఖిలపక్ష నేతలు, గ్రామ పెద్దలు(ఫైల్)

బాలాపూర్‌కు చెందిన బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అత్త, మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి(సీఎస్ఆర్) తల్లి సరోజనమ్మ జనవరిలో కన్నుమూశారు. సాధారణంగా ఎవరి ఇంట్లోనైనా పెద్దవాళ్లు మరణిస్తే పది రోజుల పాటు బంధుమిత్రులు పరామర్శకు వస్తుంటారు. అలా వచ్చేవారు మద్యం, ఆహారం తీసుకుని రావడం తెలంగాణలో సాధారణ ప్రక్రియగా మారింది. అయితే సీఎస్ఆర్ మాత్రం తన తల్లి మరణించిన రోజు నుంచి దశదిన కర్మ ముగిసేదాకా ఎవరూ కూడా మద్యం తీసుకురాకుండా కట్టడి చేశారు. తెలియకుండా ఎవరైనా తీసుకువచ్చినా సున్నితంగా తిరస్కరించి వెనక్కి పంపించారు. పరామర్శల కారణంగా మద్యం సేవించడంతో అది మోతాదుకు మించిపోతోందని, దాంతో అనేక మంది అనారోగ్యం బారిన పడుతున్నారని, అందుకే తాను మద్యం తీసుకురాకుండా కట్టడి చేశానని ఆయన చెప్పారు. శుభకార్యాల్లో సైతం మద్యం ఏర్పాటు చేయడాన్ని క్రమంగా తగ్గించుకోవాల్సిన అవసరం ఉన్నదని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. కాగా సీఎస్ఆర్ తీసుకున్న నిర్ణయాన్ని సమావేశంలో పాల్గొన్న గ్రామపెద్దలు స్వాగతించారు. డిప్యూటీ మేయర్ శేఖర్ సమావేశంలో ఈ విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. స్థానికులు మరోసారి సమావేశం ఏర్పాటు చేసుకుని దీనిపై సైతం నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని ఆయన అన్నారు. అందరూ ఇదే దారిలో నడిస్తే బాగుంటుందని ఆయనతో పాటు అఖిలపక్ష నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.

తీర్మానం అమలుకు నోచుకునేనా..?

కాగా అఖిలపక్ష సమావేశంలో చేసిన తీర్మానం, తీసుకున్న నిర్ణయం అమలుకు నోచుకుంటుందా లేదా? అన్నది స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. సమావేశం జరిగి పది రోజులు గడవగా నేటికీ దీనిపై సంబంధిత అధికారులకు లేఖ అందజేయకపోవడం గమనార్హం! దాంతో సమావేశం వృథా ప్రయాసేనా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బెల్టు షాపులపై ఆధారపడి కాలం వెళ్లదీస్తున్న వారి పరిస్థితి ఏమిటన్న ప్రశ్న సైతం తలెత్తుతోంది. వారికి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలపై ఆలోచన చేస్తున్నట్టు తెలిసింది. మరోపక్క కల్లు కాంపౌండ్‌లో మద్యం విక్రయాలను అరికట్టడం సాధ్యమేనా? అనే చర్చ నడుస్తోంది.

ఎక్సైజ్ అధికారుల హడావుడి ఒక్కరోజుకే పరిమితం..

బెల్టుషాపుల నియంత్రణపై ఎక్సైజ్ అధికారులు దృష్టి సారించడం లేదనే విమర్శలు వినవస్తున్నాయి. మీడియాలో కథనాలు వచ్చినప్పుడు హడావుడి చేసి, తూతూ మంత్రంగా నాలుగైదు షాపులపై దాడులు చేసి ఆ తర్వాత మిన్నకుంటున్నారనే ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. జనవరిలో 'ఎనీ టైమ్ మందు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కాగా ఆ ఒక్క రోజు మాత్రం అధికారులు హడావుడి చేసి ఓ ప్రెస్‌నోట్ రిలీజ్ చేశారు. ఆ తర్వాత మళ్లీ ఆ ఊసే ఎత్తడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వైన్స్ నుంచి, బెల్టు షాపుల నుంచి నెలవారీ వచ్చే మామూళ్ల కారణంగా అధికారులు వారికి తమ వంతు 'సహకారం' అందజేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. మరి బాలాపూర్‌లో చేసిన తీర్మానం చూసైనా అధికారుల్లో మార్పు వస్తుందా లేదా? అన్నది వేచి చూడాల్సిందే..!

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ఎల్‌బీనగర్/మన్సూరాబాద్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ సర్కిల్-3 పరిధిలోని మన్సూరాబాద్, నాగోల్, హయత్‌నగర్, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్లకు సంబంధించిన రూ.21.17కోట్ల నిధులతో చేపట్టే పలు కాలనీల అభివృద్ధి పనులకు మన్సూరాబాద్ సహారా ఎస్టేట్స్ సమీపంలోని వివేకానంద విగ్రహం వద్ద ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి మంత్రి శ్రీధర్‌బాబు సోమవారం శంకుస్థాపన చేశారు. ఇందులో మన్సూరాబాద్ డివిజన్లలో రూ.3.32కోట్ల నిధులతో సహారా ఎస్టేట్స్‌లో బాక్స్‌డ్రైన్, యూజీడీ పైప్‌లైన్, సీసీ రోడ్డు పనులు చేపట్టడం విశేషం. అనంతరం తమతమ ప్రాంతాల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాలంటూ వివిధ కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డిలు వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, తెలంగాణ రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కార్పొరేటర్లు దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, రంగానర్సింహగుప్తా, పవన్‌కుమార్, సుజాతానాయక్, వెంకటేశ్వర్‌రెడ్డి, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, వంగ మధుసూదన్‌రెడ్డి, సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి, పీసీసీ మాజీ కార్యదర్శులు ముద్దగోని రామ్మోహన్‌గౌడ్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, గజ్జి భాస్కర్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ మల్లారపు శాలిని, ఈశ్వరమ్మయాదవ్ పాల్గొన్నారు.

కొత్తపేటలో కార్యకర్తల తోపులాటల మధ్య..

కొత్తపేట : బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల కార్యకర్తల తోపులాటలు, నినాదాల మధ్య కొత్తపేట డివిజన్‌లో రూ 30.03 కోట్లతో అభివృద్ధి పనులకు, గడ్డిఅన్నారం, చైతన్యపురి డివిజన్ల అభివృద్ధి పనులకు సోమవారం ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ పవన్‌కుమార్‌లతో కలిసి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీదర్‌బాబు శంకుస్థాపన చేశారు.

శంకుస్థాపనకు మూడు పార్టీల ప్రజాప్రతినిధులు రావడంతో..

అభివృద్ధి పనుల శంకుస్థాపనకు మూడు పార్టీల ప్రజాప్రతినిధులు వస్తుండడంతో సోమవారం కొత్తపేట - మోహననగర్ దారిలో సమ్మిశ్రిత పూరిత వాతావరణం నెలకొంది. ఎల్బీనగర్ శాసనసభ నియోజకవర్గానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి. కాంగ్రెస్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్‌లు బీజేపీకి చెందిన వారు. మాజీ ఎంపీ, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎల్బీనగర్, వనస్థలిపురం ఏసీపీలు కృష్ణయ్య, కాశిరెడ్డిల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. చైతన్యపురి లా అండ్ ఆర్డర్ పోలీసులు, సాయుధ పోలీసులు శంకుస్థాపనకు ముందు సప్తగిరి కాలనీకి చేరుకున్నారు. అప్పటికే ఆయా పార్టీల నాయకుల, ప్రజాప్రతినిధుల అనుయాయులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని నాయకుల కోసం వేచిఉన్నారు. ఎంపీ ఈటల రాజేందర్ మోహన్‌నగర్ బీజేపీ కార్యాలయం నుంచి సప్తగిరి కాలనీకి విచ్చేశారు. ఆయనకు స్వాగతం పలికిన నాయకులు కార్యకర్తలు బీజేపీ జిందాబాద్, జైశ్రీరామ్, ఈటల నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు విచ్చేసిన వెంటనే కాంగ్రెస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ జిందాబాద్ అంటు నినాదాలు చేయడం మొదలు పెట్టారు. శంకుస్థాపన స్థలం కార్యకర్తలు, నాయకులతో కిక్కిరిసిపోడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. శంకుస్థాపన తంతు జరుగుతుండగానే మూడు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాట మొదలైంది. మంత్రి, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే తదితరులు తమ తమ వాహనాల వైపు కదులుతున్న సమయంలో తోపులాట ఉధృతంగా మారింది. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకపోవడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.


హయత్‌నగర్ సర్కిల్ పరిధిలోని అభివృద్ధి పనులకు ఎంపీ ఈటలతో కలిసి శంకుస్థాపన చేస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

నాయకులు, కార్యకర్తలే నా రాజకీయ వారసులు

● **టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్**

చంపాపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలే నా రాజకీయ వారసులని ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని జడ్పీరోడ్‌లోని శ్రీరమణకాలనీ వైజంక్షన్‌లో రూ.30కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సోమవారం రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్‌రెడ్డి, బుగ్గారపు దయానంద్, మధుయాష్కీగౌడ్, కార్పొరేటర్ సుజాతానాయక్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి అత్యవసర పనులు ఉన్నందున బహిరంగ సభలో పాల్గొనకుండా వెళ్లిపోయారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా మధుయాష్కీ గౌడ్, రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, టీపీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ కార్పొరేటర్ సుజాతానాయక్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అతనిపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని, వెంటనే పోలీసులు అతన్ని అరెస్టు చేయాలని కోరారు. రాజకీయ వ్యభిచారి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అని, కాంగ్రెస్ పార్టీ గుర్తుతో గెలిసి బీఆర్ఎస్‌లోకి వెళ్లాడని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌తో సమానంగా ఎల్బీనగర్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని తమను ఆదేశించినట్లు, వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.800కోట్లతో ప్రతిపాదనలు చేసి సీఎంకు అందించినట్లు పేర్కొన్నారు. తాను నీతి నిజాయితీతో బతుకుతున్నట్లు, కార్పొరేటర్‌గా ఉన్నపుడు సుధీర్‌రెడ్డి ఆస్తులు, ఎమ్మెల్యే అయిన తర్వాత సుధీర్‌రెడ్డి ఆస్తులు ఎన్నో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఎల్బీనగర్ అభివృద్ధికి జిల్లా మంత్రి శ్రీధర్‌బాబు నిధులు కేటాయించడం సంతోషకరమని అన్నారు. ఎన్ని పనులు ఉన్నా మంత్రి నియోజకవర్గంలో శంకుస్థాపనల కోసం వచ్చినట్లు పేర్కొన్నారు. పార్టీలు ఏవైనా అభివృద్ధిలో కలిసి ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సుజాతానాయక్, కార్పొరేటర్లు వెంకటేశ్వర్‌రెడ్డి, దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, హనుమాన్ దేవస్థానం మాజీ చైర్మన్ నల్లా రఘుమారెడ్డి, సీనియర్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట్‌యాదవ్, డివిజన్ అధ్యక్షులు శ్రీపాల్‌రెడ్డి, శశిదర్‌రెడ్డి పాల్గొన్నారు.


బహిరంగసభలో మాట్లాడుతున్న మధుయాష్కీగౌడ్

వైభవంగా సీతారాముల శోభాయాత్ర

ఎల్‌బీనగర్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ చంద్రపురికాలనీలోని యువేరా హైట్స్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి సీతారాముల శోభాయాత్ర అంగరంగ వైభంగా జరిగింది. ఉదయం కల్యాణోత్సవం నిర్వహించిన అసోసియేషన్ ప్రతినిధులు రాత్రి శోభాయాత్రను అపార్ట్‌మెంట్స్ పరిసరాలలో మేళతాళాలతో నిర్వహించారు. ఈ శోభాయాత్రలో అసోసియేషన్ ప్రతినిధులతో పాటు మహిళలు, చిన్నారులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సైదాబాద్ : మలక్‌పేట బీ బ్లాక్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో సీతారాముల మహోత్సవంలో భాగంగా సోమవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఆదివారం రథ సేవా ఊరేగింపు భక్తిశ్రద్ధలతో భక్తుల భజనల మధ్య కొనసాగింది. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ బి.గంగాధర్, ప్రధాన కార్యదర్శి పాల మధుసూదన్, కోశాధికారి శంకర్, ప్రచార కార్యదర్శి డాక్టర్ ఎస్.విజయభాస్కర్, ఉపాధ్యక్షుడు అయిలయ్య, సలహాదారులు గుండా మల్లయ్య, కృష్ణారెడ్డి, సభ్యులు వేణు చంద్రయ్య, హరినాథ్ పాల్గొన్నారు.


శోభాయాత్రలో పాల్గొన్న అసోసియేషన్ ప్రతినిధులు


సామ నర్సింహారెడ్డికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

సామ నర్సింహారెడ్డికి ఘన నివాళి

చంపాపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి, మాదన్నపేట వెజిటేబుల్ మార్కెట్ కార్యదర్శి చంపాపేటకు చెందిన సామ నర్సింహారెడ్డికి సోమవారం లక్ష్మారెడ్డి గార్డెన్‌లో జరిగిన దశదిన కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, బంధుమిత్రులు ఘనంగా నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు. అనంతరం వారు వేర్వేరుగా నర్సింహారెడ్డి కుటుంబ సభ్యులు, వారి కుమారులు సామ గౌతంరెడ్డి, సామ వంశీధర్‌రెడ్డిలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.


జ్ఞాపిక అందజేస్తున్న తీగల కృష్ణారెడ్డి

టీకేఆర్‌లో షిజ్నే కల్చరల్ ఫెస్ట్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : తీగల కృష్ణారెడ్డి(టీకేఆర్) ఎడ్యుకేషనల్ సొసైటీ వార్షికోత్సవాలు ఆదివారం రాత్రి నిర్వహించిన షిజ్నే కల్చరల్ ఫెస్ట్‌తో ముగిశాయి. బాలీవుడ్ గాయని జొనితా గాంధీతో పాటుగా టాలీవుడ్ గాయకుడు రోల్ రైడాల ప్రత్యేక ప్రదర్శనలతో విద్యార్థులు ఆనందోత్సాహాలలో తేలియాడారు. తీగల కృష్ణారెడ్డితో పాటుగా ఇనిస్టిట్యూట్స్ నిర్వాహక బృందం మొత్తం ఈ వేడుకలలో పాలుపంచుకున్నారు.



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి శ్రీదేవి

ఆరోగ్యాన్ని మించిన ఆస్తిలేదు

● **రంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీదేవి**

రంగారెడ్డి జిల్లా కోర్టులు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మంచి ఆరోగ్యాన్ని మించిన ఆస్తిలేదని రంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీదేవి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయసేవా సదన్‌లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి కాలంలో ప్రజలు ఆరోగ్యంగా లేకపోవడానికి కారణం జంక్‌ఫుడ్ తీసుకోవడమేనన్నారు. చాలామంది రెడీమేడ్ ఫుడ్, అవుట్‌డోర్ ఫుడ్‌ను ఇష్టపడతారన్నారు. ఎందుకంటే అవి రుచికరంగా, సులభంగా లభిస్తాయన్నారు. జంక్‌ఫుడ్ అనేక రకాల రసాయనాలతో తయారు చేయబడి ఉంటాయన్నారు. వ్యాధులు ఎక్కువగా రావడానికి కారణం ఇదేనన్నారు. మనం ఆరోగ్యంగా ఉండాలనుకుంటే ఎల్లప్పుడు ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినాలని సూచించారు. అంతేకాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలి గడపాలన్నారు. సంతోషకరమైన జీవితాన్ని గడపడానికి ఆరోగ్యం చాలా అవసరమన్నారు. ఈ గ్రహం మీద ఉన్న డబ్బు లేదా మరే ఇతర భౌతిక వస్తువులు ఆరోగ్య విలువను భర్తీ చేయడానికి తగినవి కావన్నారు. ఆరోగ్యకరమైన మానవ శరీరం అన్ని ఆనందాలకు ప్రధాన మూలమన్నారు. ప్రజలు దీనిని గొప్పవరంలా అంగీకరించాలన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఏటా నిర్వహించే ఎనిమిది అధికారిక ఆరోగ్య ప్రచారాలలో ఒకటిగా ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించిందన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం కాకుండా ప్రచారాల జాబితాలో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం, ప్రపంచ రోగనిరోధక వారం, ప్రపంచ పొగాకు రహిత దినోత్సవం, ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం ఉన్నాయన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నాడు ప్రపంచ వ్యాప్తంగా దాదాపు అన్ని ఆరోగ్య సంస్థలు వివిధ ఆరోగ్య అధికారులు, ప్రతినిధుల భాగస్వామ్యంతో అవగాహన తరగతులను నిర్వహిస్తాయన్నారు. ఇలాంటి తరగతులు చాలా ముఖ్యమైనవన్నారు. ఎందుకంటే అవి మన సమాజంలోని ఎన్నో తెలియని వ్యాధుల పట్ల మనకు జ్ఞానాన్ని అందిస్తాయన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు, ప్రముఖ వైద్యులు విష్ణువర్ధన్‌రావు, ప్రముఖ విద్యావేత్త వసుధారాణిలతో పాటు పలువురు న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.